ప్రజాశక్తి

బుధవారం 11 జనవరి 2023

పవర్ లిఫ్టింగ్‌లో జారాకు బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఎస్. జారా మొత్తం 280 కేజీల బరువు ఎత్తి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. జాతీయ పోటీల్లో పాల్గొన్న ఎస్.జార మొత్తం స్వాడ్ 90 కేజీలు, బెంచ్ ప్రెష్ 70 కేజీలు, డెడ్ లిఫ్ట్ లో 120 కేజీలు బరువు ఎత్తి మూడు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది.

రైతన్న భూములకు జగనన్న రంగు

- పట్టాదారు పాస్ పుస్తకాలపై వైసిపి హంగులు
- జగనన్న పేరిట భూహక్కు పత్రాలు
- పుస్తకంపై జగన్ ఫొటోలు
- ఆపై నవరత్నాల ప్రచార లోగో
- విస్తుపోతున్న ప్రజానీకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సొమ్ము ఒకరిది..సోకొకరిది అన్నట్లు ఉంది భూ హక్కుపత్రాల జారీలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు. తాత తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములకు, కష్టపడి కొనుగోలు చేసుకున్న భూములకు సంబంధించిన పత్రాలపై సిఎం జగన్మోహన్‌రెడ్డి పేరుపెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. పేరు ఒక్కటే కాదు సుమా...! ముందు, వెనుక పేజీల్లో వైసిపి జెండా రంగులతో కూడిన హంగులు, ఆయా పేజీల్లోనూ పెట్టిన రెండు సిఎం జగన్ ఫొటోలు, నవ రత్నాల లోగోలు హాస్యాస్పదంగా మారాయి. రైతుల వ్యక్తిగత ఆస్తిహక్కుపై సిఎం ఫోటోలు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. సమగ్ర భూ సర్వే పేరిట రీసర్వే చేస్తున్న విషయం విధితమే. ఇందుకు తగినంత సిబ్బందిని నియమించకపోవడంతో నత్తనడకన సాగుతోంది.

విజయనగరం జిల్లాలో బొండపల్లి మండలం తమటాడ రెవెన్యూ గ్రామంలో సమగ్ర భూ సర్వేను సుమారు ఏడాది క్రితం ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఇప్పటికే ఈ గ్రామంలో సర్వే పూర్తయినట్టు ప్రభుత్వం ప్రకటించింది. పది రోజుల క్రితం జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా పంపిణీ చేశారు. ఈనేపథ్యంలో ఈ గ్రామాన్ని ప్రజాశక్తి బృందం సందర్శించి, రీ సర్వే జరిగిన తీరుతెన్నులు, ప్రభుత్వ, ప్రైవేటు భూములు, పాసు పుస్తకాల జారీ తదితర అంశాలపై ఆరా తీసింది.

తమటాడ రెవెన్యూ గ్రామం 466.30ఎకరాల పరిధిలో విస్తరించి ఉంది. గ్రామంలో మొత్తం 160కుటుంబాలు ఉన్నాయి. 360 భూ ఖాతాదారులు ఉన్నారు. వీరిలో కేవలం 18మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారు. మిగిలిన ఖాతాదారులకు ఇతర రెవెన్యూ గ్రామాల పరిధిలో కూడా ఖాతాలు ఉండడం, తదితర సాంకేతిక కారణాల వల్ల ఇవ్వలేదని అధికారులు చెప్తున్నారు. భూముల వివరాలు ఇంకా ఆన్‌లైన్ కాలేదు. 1బిలు రావడం లేదు. కానీ, ఈ గ్రామంలో సర్వే పూర్తిచేసినట్టు అధికారులు చెప్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం, 1బి సమస్య వల్ల 'రీ సర్వే వల్ల కొత్త పాసుపస్తుకాలు తప్ప కొత్తగా ఒరిగిందేమీ లేదు' అంటూ పలువురు రైతులు చెప్పారు. సర్వే, సరిహద్దుల సంగతి కాస్త పక్కనబెడితే పాస్ పుస్తకాల్లో వైసిపి జెండా రంగులను పులిమారని, ఇది ఏమాత్రం సరికాదని కొందరు రైతులు అన్నారు. ఇప్పటి వరకు జారీచేసిన పాస్ పుస్తకాల్లో ఎక్కడా ముఖ్యమంత్రుల ఫోటోలు లేవని, ఈసారి రెండు పేజీల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డి ఫోటోలు ముద్రించారని, రైతుల సొంత ఆస్తులకు హక్కులు కల్పించే క్రమంలో ఇటువంటి ప్రచార్భాటాలు తగవంటూ పేరు చెప్పడానికి ఇష్టపడని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వం జారీచేసిన పాస్‌పుస్తకాలపై జాతీయ జెండా చిహ్నంగా ఉండేదని, దాన్ని ఇలా దిగజార్చడం తగదని, ఇలా అయితే ముఖ్యమంత్రులు మారినప్పుడల్లా పాస్‌పుస్తకాలు మార్పు చేయాల్సివస్తుందని, దాని వల్ల సమయం, ప్రజాధనం దుర్వినియోగమౌతుందని అన్నారు.

రీ సర్వేలో భాగంగా గ్రామానికి వచ్చిన అధికారులు రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు ఆధారంగా భూమిని గుర్తించి, లింకులతో కొలిచినట్టుగా రైతులు చెప్పారు. భూ కమతాల సరిహద్దు రైతుల అభిప్రాయాలను కూడా తీసుకున్నారు. రైతుల భూముల మధ్య రికార్డు పరంగా వ్యత్యాసం లేకపోయినప్పటికీ సాగు భూముల మధ్య హెచ్చుతగ్గులు కనిపించాయి. రికార్డులో సాగు విస్తీర్ణం తక్కువగా ఉన్నప్పటికీ సాగు భూమి ఎక్కువగా ఉంది. ఈ మేరకు కొన్ని చోట్ల రస్తాలు, చెరువులు ఆక్రమణలకు గురైనట్టు తేలింది. గ్రామానికి సమీపంలోవున్న కొండ ఎకరాల వరకు ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. ఈ భూమిపై సాగు హక్కు కల్పించడం లేదా అనర్హత పేరుతో తొలగించడం వంటివి అధికారులు చేయలేదు. కేవలం రికార్డుల టాలీ వరకే అధికారులు పరిమితమయ్యారు. ఇదే విషయమై బొండపల్లి తహశీల్దార్ శ్రీనివాస మిశ్రాను వివరణ కోరగా ఆక్రమణకు గురైన స్థలాలను ఏం చేయాలనేదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదని, ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతానికి సరిహద్దుల్లో రాళ్లు పాతామని స్పష్టం చేశారు. రీ సర్వేలో ఆక్రమిత భూములు గుర్తించినప్పటికీ ఎలాంటి చర్యలూ లేనప్పుడు ఇంత హంగామా ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు

యువజన, విద్యార్థి సంఘాల బస్సుయాత్ర

- హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు..
- జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం

అభివాదం చేస్తున్న పలు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రత్యేక హోదా ఆంధ్రులు హక్కు అని, ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యువజన, విద్యార్థి సంఘాల తలపెట్టిన బస్సుయాత్రను జయప్రదం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానించారు. ఈ బస్సుయాత్ర ఈనెల 20 నుంచి వచ్చేనెల 4వరకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు సాగుతుందని తెలిపారు. మంగళవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యాన స్థానిక అంబేద్కర్ భవనంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో డివై ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రుద్ర ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణ్, తెలుగు యువత విజయనగరం పార్లమెంటు స్థానం అధ్యక్షుడు వేమలి చైతన్య బాబు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టివి రమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి 9ఏళ్లు అయినప్పటికీ విభజన చట్టంలో పేర్కొన్న నిధులు, ప్యాకేజీలు, ఉన్నత విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రాజెక్టుల ఏర్పాటుకు నిధులు కేటాయించలేదని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీతో పాటు విభజన హామీలు అమలు చేయాలని కోరారు. ప్రత్యేక హోదాతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈనేపథ్యంలో జరిగే బస్సుయాత్రను విద్యార్థులు, యువజనులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, నాయకులు రామకృష్ణ, వెంకటేష్, సతీష్, హర్ష, రవి, మణికంఠ, జగదీశ్, డివైఎఫ్ఐ సహాయ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీ పూర్తి చేయండి : జెసి

సమీక్ష నిర్వహిస్తున్న జెసి అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

రీ-సర్వే పూర్తయిన ప్రాంతాల్లో సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి భూహక్కు పత్రాలను సంబంధిత భూ యజమానులకు త్వరితగతిన అందజేయాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ తహశీల్దార్లను ఆదేశించారు. ఖాతా నంబరు, ఎల్.పి.ఎం. నంబర్లలో తప్పులుంటే తప్ప భూహక్కు పత్రాల పంపిణీని ఆపొద్దని తహశీల్దార్లకు సూచించారు. రీ- సర్వే ప్రక్రియ, భూహక్కు పత్రాల పంపిణీ గురించి జిల్లాలోని తహశీల్దార్లతో ఆయన గూగుల్ మీట్ ద్వారా మంగళవారం సమీక్ష నిర్వహించారు. గడువు చాలా తక్కువ ఉందని కావున అందరూ సమన్వయంతో రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని, సర్వే పూర్తయిన చోట్ల సంబంధిత భూహక్కు పత్రాలను సంక్రాంతి పండగకు ముందే రైతులకు అందజేయాలని ఆదేశించారు. మ్యుటేషన్ రిక్వెస్టులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ డివిజన్లకు వచ్చిన భూహక్కు పత్రాలను పంపిణీకి ముందే ఆర్డీవోలు పరిశీలించాలని, తప్పులేమైనా ఉంటే సవరణకు సిఫార్సు చేయాలని పేర్కొన్నారు. పండగలకు అందరూ వస్తారు కాబట్టి ప్రత్యేక క్యాంపైన్ ద్వారా సంబంధిత ఫోటోలు సేకరించి అప్‌లోడ్ చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి ఆర్‌డిఒలు సూర్యకళ, అప్పారావు, శేషశైలజ, అన్ని మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

మైత్రి మీడియా సంక్రాంతి సంబరాలు

సంబరాలను తిలకిస్తున్న జెడ్‌పిచైర్మన్, అవనాపు విక్రమ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మైత్రీ మీడియా, జి-తెలుగు సంయుక్తంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రంగవల్లుల కిడ్స్ ఫాన్సీ డ్రెస్ పోటీలు జరిగాయి. బిగ్ బాస్ ఫేం సిరి, జీ తెలుగు మేనేజర్ అర్జున్, సినీ నేపథ్య గాయని సురభి శ్రావణిలతో కలిసి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు . క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా నిర్వహించిన ట్రెజర్ హంట్, గురజాడ కళాభారతి లో జరిగిన రంగోలీ, కిడ్స్ ఫాన్సీ డ్రెస్ విజేతలకు అతిథులు బహుమతులు అందజేసారు . ఈ సందర్భంగా మైత్రీ మీడియా మేనేజింగ్ డైరెక్టర్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మన సంస్కృ సంప్రదాయాలను భావితరాలకు అందించడం ధ్యేయంగా ఈ కార్యక్రమాలు చేపట్టామన్నారు. అంతేకాకుండా మరింత మందికి చేరువవ్వాలనే లక్ష్యంతో యుట్యూబ్ ,ఫేస్ బుక్ ల ద్వారా కూడా తమ ప్రసారాలను అందిస్తున్నామని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన మైత్రీ మీడియా డైరెక్టర్ అవనాపు విక్రమ్ మాట్లాడుతూ సనాతన సంప్రదాయాలు, సంస్కృతి కనుమరుగై పోకుండా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మైత్రి మీడియా డైరెక్టర్ లు కాకర్లపూడి సీతారామరాజు , ముదునూరు సాయి నఖుల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పప్పల చీటి నిందితులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని పప్పుల చీటీ పేరిట ఛీటింగ్‌కు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిలో విజయనగరం మండలం కొండకరకాం గ్రామానికి చెందిన మజ్జి అప్పలరాజు, మజ్జి రమేష్, నెల్లిమర్ల మండలం కొండగుంపాం గ్రామానికి చెందిన పతివాడ శ్రీలేఖ ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వీరి ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా వేలాది మందితో డబ్బులు కట్టించుకున్నట్టు సమాచారం. బాధితులు గుర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని గుర్ల పిహెచ్‌సిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం విజయనగరం తరలించినట్టు సమాచారం. ఈ ఘరానా మోసంలో తొలుత రూ.4కోట్లకు పైగా టోకరా వేసినట్టు ప్రాథమిక అంచనాలు వేశారు. రోజులు గడుస్తున్న కొద్దీ తీగ లాగితే డొంక కదిలినట్టు బాధితులు బయటకు వస్తుండడంతో రూ.10కోట్లకుపైగానే శఠగోపం పెట్టి ఉండవచ్చని భావిస్తున్నారు.మరోవైపు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆ డబ్బును ఎటువైపు మళ్లించారు? వారి పేరున ఉన్న ఆస్తుల వివరాలు ఏమిటి? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు డిఐజి నుంచి ఆదేశాలు కూడా అందినట్టుగా సమాచారం.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

కొనసాగిన గ్రీన్‌అంబాసిడర్ల నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి వేతనాలు చెల్లించాలని, వేతనం రూ.10వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద గ్రీన్ అంబాసిడర్లు చేపట్టిన నిరసన దీక్ష రెండోరోజు మంగళవారం కూడా కొనసాగింది. దీక్షను ఉద్దేశించి గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ మాట్లాడారు. నెలలు తరబడి వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం తమ జీతాలు చెల్లించేందుకు బాధ్యత వహించాలని, పంచాయితీలకు అప్పచెప్పవద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో నెం. 680 ప్రకారం రూ.10వేలు జీతం చెల్లించాలన్నారు. పిఎఫ్, ఇయస్ఐ అమలు చేయాలని, గుర్తింపు కార్డులు, ప్రమాద భీమా రూ 20లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.రిక్షాలకు అయిన రిపేర్ల ఖర్చులు ప్రభుత్వం భరించాలన్నారు.కార్మిలకు భద్రత పరికరాలు ఇవ్వాలని కోరారు. దీక్షలో ముత్యాలు, బంగారప్పడు, రాజు, గోపి, గురుమూర్తి, స్వాతి, కార్మికులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని మూడో డివిజన్‌లో బోరును, నాలుగో డివిజన్‌లో కమ్యూనిటీ భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం ప్రారంభించారు. నాలుగో డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ డివిజన్లో మూడు కోట్ల రూపాయల మేర అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ చేపట్టా రన్నారు.

నాలుగు డివిజన్ వ్యాసన్నారాయణ మెట్ట ప్రాంతంలో 500కెఎల్ సామర్థ్యం గల వాటర్ ట్యాంకును కోలగట్ల లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కుళాయి నుండి నీళ్లు విడుదల చేసి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా తాము చేసిన ముందస్తు ప్రయత్నాలు సత్ఫలితాన్నిచ్చా యన్నారు. వివిధ ప్రాంతాలలో 600 వరకు ఇంటర్ కనెక్షన్లను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామన్నారు. ఈ ట్యాంకు ద్వారా 3,4, 11 డివిజన్ ప్రాంత వాసులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వి రాజేష్, కార్పొరేటర్లు ముద్దాడ మధు, మూడో డివిజన్ నాయకులు వజ్రపు శ్రీను పాల్గొన్నారు.పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా

ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎంఇఒ కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు మాట్లాడారు. పండగ నెలలో వేతనాలు ఇప్పటివరకు విడుదల చేయకపోవడం బాధాకరం అన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ కోరారు. కార్యమంలో జెఎసి నాయకులు లక్ష్మణ, జాకీ, రాము, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి

డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం ఈనెల 23తో 10ఏళ్ల కాలపరిమితి ముగుస్తున్నందున ఈ చట్టాన్ని కొనసాగించాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. దళిత, గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా 2012లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రత్యేకంగా 3 రోజులు పాటు చర్చించి ఏకగ్రీవంగా ఈ చట్టాన్ని రూపొందించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల్లో వచ్చిన ప్రాధాన్యతల్లో ఈ చట్టం అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోయిందన్నారు. ఎస్సీ ఎస్టీ జీవితాలు గతంలో కంటే నేడు దుర్భర పరిస్థితులోకి నెట్టబడ్డాయి. రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగా దళిత గిరిజనుల జీవనప్రమాణాల్లో మార్పు తెచ్చేందుకు దోహద పడే సబ్ ప్లాన్ చట్టాన్ని కాలపరిమితితో సంబంధం లేకుండా వారి సమగ్రాభివృద్ధి - సాధికారతకు దోహత పడేవిధంగా తక్షణమే ప్రత్యక అసెంబ్లీ సమావేశాలు జరిపి పాత చట్టం స్థానంలో సరికొత్త శ్వాశత చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి రాయి ఈశ్వరరావు, యూనియన్ శ్రామిక మహిళా విభాగం కన్వీనర్ పీరుబండి సత్యవతి, డొమెస్టిక్ వర్కర్స్ ఫారం ఇండియా కోఆర్డినేటర్ కె వరలక్ష్మి, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర కమిటీ మెంబర్ కొత్తపల్లి స్వప్న, సురగాల యమున తదితరులు పాల్గొన్నారు.

సాహితీ దిగ్గజం గురజాడ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రపంచ ప్రఖ్యాత సాహితీ దిగ్గజం మహాకవి గురజాడ వెంకట అప్పారావు అని ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధేయ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ కొనియాడారు. మంగళవారం గురజాడ పురాతన గృహాన్ని సందర్శించారు. గురజాడ సేకరించిన పుస్తకాలు, ఆయన ఉపయోగించిన కళ్లద్దాలు, టేబుల్, కుర్చీని తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురజాడ గొప్ప సంఘ సంస్కర్త మాత్రమే కాకుండా బహుముఖ ప్రజ్ఞాశాలి అని అభివర్ణించారు. తన కలం ద్వారా లక్షలాది మందికి, మాతృదేశానికి సేవ చేయాలని స్ఫూర్తినిచ్చిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడుగా పేర్కొన్నారు. ఆనాటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడటమేగాకుండా సాహిత్య, నాటక రంగాలకు ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో భాషావేత్త డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్, గురజాడ అప్పారావు కుటుంబ సభ్యులు గురజాడ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ధర్నా



గ్రీన్‌ఫీల్డు హైవే కాంట్రాక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస, చీపురువలస గ్రామాల మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కలిగట్ల కనక సూర్య సుబ్రహ్మణ్యం (50) మృతి చెందాడు. గ్రీన్ ఫీల్డు హైవే పనులకు సంబంధించిన బొలేరో వాహనం ఢీకొని మృతి చెందడంతో పోస్టుమార్టం అనంతరం సంఘటనా స్థలానికి మంగళవారం మృత దేహాన్ని తీసుకువచ్చి కుటుంబీకులు, గ్రామస్తులు ధర్నా చేపట్టారు. కొత్తవలస నుంచి తన స్వగ్రామానికి చేరుకుంటున్న సూర్య సుబ్రహ్మణ్యయి బొలేరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన గ్రీన్ ఫీల్డ్ హైవే సిబ్బందిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అయితే తమకు సంబంధం లేదని ఆ కంపెనీ సిబ్బంది తెలపడంతో ఆగ్రహించిన గ్రామస్తులు కార్యాలయంపై దాడి చేసేందుకు సిద్ధమవడంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. సిఐ బాల సూర్యారావు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. నిర్మాణపనులు జరుగుతుండడంతో రోడ్లమీద వాహనాలు పరిమితికి మించిన స్పీడ్ తో తిరుగుతున్నాయని, దీనిపై గతంలో సంబంధిత కార్యాలయానికి గ్రామ పెద్దలు ఫిర్యాదు చేసినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు లేదని అన్నారు. కాంట్రాక్టర్ తమకు తోచిన సాయం చేస్తామని తెలపడంతో ప్రజలు కోపోద్రికులై కార్యాలయాన్ని ముట్టడించారు. మృతిని కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. అయినప్పటికీ గ్రీన్‌ఫీల్డు సిబ్బంది స్పందించకపోవడంతో ఆ సంస్థ కార్యాలయం వద్దే దహన సంస్కారాలు నిర్వహించారు. సర్పంచ్ ఎం.ఎర్రయ్య రామస్వామి, వార్డు సభ్యులు గొరపల్లి రాము సమక్షంలో చర్చలు జరిగాయి. మృతునికి కుటుంబానికి రూ.8లక్షలు చెల్లించేందుకు కాంట్రాక్టర్ అంగీకరించారు.

డిఆర్‌సి సమావేశం వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా సమీక్షా సమావేశం వాయిదా పడినట్లు కలెక్టర్ ఎ. సూర్యకుమారి తెలిపారు. 6వ విడత జగనన్న తోడు కార్యక్రమం ఈనెల 11న ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్న దృష్ట్యా అదే రోజున జరగాల్సిన జిల్లా సమీక్షా సమావేశం వాయిదా పడినట్లు తెలిపారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి తెలిపారు. మంగళవారం తన ఛాంబర్‌లో జిల్లా కేంద్ర గ్రంథాలయం సర్వసభ్య సమావేశం జరిగింది. కంప్యూటర్ల కొనుగోలు, ప్రింటింగ్ ఫారాలు, సిసి కెమెరా ఏర్పాటు, జెరాక్స్ మిషన్ కొనుగోలుపై కమిటీ సభ్యులతో చర్చించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ కేంద్ర గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యదర్శి లలిత మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగులు ప్రతి ఒక్కరూ అభివద్ధిలో భాగస్వామ్యం కావాలని అన్నారు.

బిసిలకు ఎమ్మెల్యే టిక్కెట్ సాధించే వరకు పోరాటం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అత్యధికంగా బిసి ఓటర్లు ఉన్న విజయనగరం నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ బిసి అభ్యర్థికి కేటాయించే వరకు పోరాడుతామని వైసిపి నాయకులు పిల్లా విజయకుమార్, అవనాపు విజయ్ తెలిపారు. మంగళవారం అవనాపు నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2లక్షల 50వేలు ఉన్న ఓటర్లు ఉన్న విజయనగరం నియోజకవర్గంలో 2లక్షల 15వేల మంది బిసిలు ఉన్నారని తెలిపారు. ఓసిలకు టికెట్ ఇచ్చి బిసిలు ను వెనక్కి నెట్టడం సరికాదన్నారు. ఎంతకాలం రాజ్యాధికారం లేకుండా ఉంటామని ప్రశ్నించారు. బిసిల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని, వారిని గెలిపించుకునే బాధ్యత తమదని అన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ లు గాడు అప్పారావు, పొట్నూరు పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధి మీడియా

ప్రజాశక్తి- విజయనగరం కోట

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా మీడియా వ్యవహరిస్తుందని ఆ విషయంలో వాజీ ఛానల్ సఫలీకృతమైందని పౌరసంబంధాల శాఖ ఎడి డి.రమేష్ పేర్కొన్నారు. మంగళవారం వాజీ ఛానల్‌లో కార్యాలయంలో యూట్యూబ్ సబ్‌స్క్రయిబర్ల విజేతలకు ఆయన బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 27 ఏళ్లగా రాజకీయాలకు అతీతంగా, ప్రజలకు,ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు మధ్య వారధిగా నిలుస్తూ సమస్యలను పరిష్కరిచడంలో తనదైన పాత్రను పోషిస్తుందని అభినందించారు.

సీతంలో సంక్రాంతి సంబరాలు

విజయనగరం : గాజులరేగలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థులనుద్దేశించి డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ భావి తరాలకు సంక్రాంతి శోభ తో ముడిపడిన తెలుగు వారి జీవన విధానాన్ని తెలియ పరిచేందుకే వేడుకలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామ్మూర్తి అనురాధ, బొత్స పూజిత, సాయి దేవమణి, పాల్గొన్నారు.

ఆంధ్రా కురియన్ తులసీరావు

శృంగవరపుకోట : ఆంధ్ర కురియన్ ఆడారి తులసీరావు అని విశాఖ డైరీ పాల సంఘాల వేతన కార్యదర్శులు, ఉద్యోగులు కొనియాడారు. విశాఖ డైరీ చైర్మన్ కీర్తిశేషులు ఆడారి తులసిరావుకు పట్టణంలోని యూనిట్ ఆఫీస్ నందు ఎస్.కోట, వేపాడ బిసిసిలోని వివిధ పాల సంఘాల వేతన కార్యదర్శులు, ఉద్యోగులు, డైరీ సిబ్బంది ఎస్ కోట యూనిట్ మేనేజర్ బి. శివాజీ రావు ఆధ్వర్యంలో తులసి రావుకి ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆడారి తులసీరావు సేవలను వారు కొనియాడుతూ వారి లేని లోటు తీర్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరీ సూపర్‌వైజర్లు నాయుడు, బాబు, మధు, మహేష్, సురేష్, పి.పి.ఎస్ ట్రస్ట్ సెక్రటరీ కాండ్రేగుల సన్యాసినాయుడు, వబ్బిన రమణ పాల్గొన్నారు.

గోదాం పరిశీలన

వంగర : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగాన నూతనంగా నిర్మిస్తున్న ఎఫ్‌పిఒ గోదాంను ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎఫ్‌పిఒ ఎపిఎం గోవిందరావు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయనతోపాటు వైసిపి నాయకులు బొక్కేల వెంకట అప్పలనాయుడు, కనగల పారినాయుడు పాల్గొన్నారు.

పూత దశలో జాగ్రత్తలు అవసరం

బొండపల్లి : అపరాల పూత దశలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గజపతినగరం వ్యవసాయ సహాయ సంచాలకులు కె.మహరాజన్ సూచించారు. మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో మంగళవారం రబీ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అపరాలు నాటిన 45 రోజులకు పూత దశలో పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఐదు గ్రాముల లీటరు నీటికి కలిపి ఎకరానికి పిచికారి చేయాలన్నారు. దీని వల్ల పూత, పిందే బాగా వచ్చి దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ మల్లిఖార్జునరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మింపేటలో సిఐ పర్యటన

వంగర : మండలంలోని లక్ష్మింపేటలో రాజాం రూరల్ సిఐ హెచ్. ఉపేంద్ర రావు మంగళవారం పర్యటించారు. సిఐగా ఇక్కడకు బదిలీపై వచ్చిన ఆయన మొదటిసారిగా గ్రామంలో పర్యటించి పోలీస్ అవుట్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి ప్రత్యేక కోర్టును పరిశీలించారు. అక్కడ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలోకి వెళ్లి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. చక్కగా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు వంగర పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. క్రైమ్ రికార్డులకు సంబంధించి ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ పరిశీలన

డెంకాడ : మండలంలోని పినతాడివాడ హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌ను జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ మంగలవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ వైద్య సేవలపై ఆరా తీశారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు, డెంకాడ వైద్యాధికారి డాక్టర్ రాంగాంధీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు పాఠశాలలో మంగళశారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఇఒ జి. శ్రీదేవి మంగళవారం పరిశీలించారు. స్కూల్ కమిటీ చైర్మన్ బాల భాస్కర్ ఆధ్వర్యంలో ఆమె ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం నాడు నేడు ఫేజ్2 నిధులతో చేపట్టిన పనులను, పాఠశాలలో జరుగుతున్న సమ్మెట్ పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ రావాడ రామసత్యం, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం

మండలంలోని 18 గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఇఒ జి. శ్రీదేవి మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె నాడు నేడు ప్రోగ్రెస్, ఫొటోస్ అప్డేట్ చేయు విధానం గూర్చి విపులంగా వివరించారు.

మార్చి 6, 7, 8 తేదీల్లో కనకదుర్గ పండగ

భోగాపురం : భోగాపురం గ్రామ దేవత కనక దుర్గమ్మ 59వ జాతర మహోత్సవం మార్చి 6,7,8, తేదీల్లో నిర్వహించడానికి గ్రామ పెద్దలు, వైసిపి జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, మంగళవారం ముహూర్తం నిర్ణయించారు. ఏటా ఎంతో వైభవంగా ఈ జాతరను కొమ్మూరు కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని రఘుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మూరు సుభోష్ రావు, పడాల భాను, పడాల శ్రీను, ఉదయబాబు, విశ్వేశ్వరరావు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై సభ

భోగాపురం : మండలంలోని పోలిపల్లి సచివాలయంలో సర్పంచ్ కర్రోతు వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం గ్రామసభ జరిగింది. గ్రామంలో అభివృద్ధి పనుల గురించి గ్రామ సభలో సర్పంచ్ సభ్యులకు వివరించారు. అనంతరం జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది, వైసిపి నాయకులు పతివాడ రామకృష్ణ, కార్యదర్శి ఎస్‌.సిమ్హ పాల్గొన్నారు.

గ్రామదేవత పండగకు జన సందోహం

బొబ్బిలిరూరల్ : ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు స్వగ్రామమైన పక్కి గ్రామంలో పెద పోలమ్మ అమ్మవారి గ్రామ దేవత ఉత్సవాలకు జన సందోహంతో గ్రామం కిటకిటలాడింది. ప్రతి ఐదు సంవత్సరాలకు సంక్రాంతికి ముందుగా ఈ గ్రామదేవత ఉత్స వాలు పెద్దలు నిర్వహిస్తుంటారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే పండగ వల్ల పెద్ద ఎత్తున ఆడపిల్లలు, అల్లుళ్ళు, చుట్టాలు ఈ పండక్కి అధికసంఖ్యలో హాజరవుతారు. ఎమ్మెల్యే స్వగ్రామం కావడంతో ప్రముఖులంతా సంక్రాంతి ముందే గ్రామం కళకళ లాడుతోంది.

పండగకు పలువురు ప్రముఖులు

పండుగకు డిప్యూటీ సిఎం రాజన్న దొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, గజపతినగరం ఎమ్మెల్యే అప్పల నరసయ్య, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ కె.మురళీ కృష్ణ, నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, బేబీనాయన అమ్మ వారిని, సిరిమాను సందర్శించారు.

పేదల ఆకలి తీర్చడం ఆనందంగా ఉంది

బొబ్బిలి : పేదల ఆకలి తీర్చడం ఎంతో ఆనందంగా ఉందని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ బేబీనాయన అన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు బేబీనాయన ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అన్నా క్యాంటీన్ వద్ద కేక్ కట్ చేసి పేదలకు మంగళవారం భోజనాలు పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ ద్వారా పేదల ఆకలి తీర్చడం ఎంతో ఆనందాన్ని ఇస్తున్నదన్నారు. పేదల ఆకలి తీరుస్తున్న అన్నా క్యాంటీన్‌ను వైసిపి ప్రభుత్వం మూసి వేయడం అన్యాయమన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మరలా అన్నా క్యాంటీన్లను ప్రారంభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఎస్ఎంఎస్ ప్రారంభం

నెల్లిమర్ల : మండలంలోని కొండవెలగాడలో వీధి దీపాల నిర్వహణకు ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ మేనేజ్మెంట్ సిస్టమ్‌ను మంగళవారం జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఈ విధానం వల్ల పెద్ద ఎత్తున విద్యుత్ ఆదా చేయొచ్చునన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు వల్ల విద్యుత్ ఆదా చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీధి దీపాలు ఎవరు ఆన్ చేయకుండానే టైమర్ ద్వారా సాయంత్రం చీకటి పడ్డాక వెలిగి తెల్లవారాక ఆగిపోతాయన్నారు. కాగా కొత్త విధానం వల్ల నాణ్యత పెరిగి విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యర్ర రమణ, సిస్టమ్ టెక్నీషియన్ ఎమ్.శంకర్, ఎనర్జీ అసిస్టెంట్ ప్రసాద్, శివ, గ్రామ పెద్దలు మొయిద అక్కోజీ, వల్లూరి రాము తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

వేపాడ : మండలంలోని సోంపురం, ఆతవ సచివాలయాలను ఎంపిడిఒ బివిఎస్‌కెవిఎన్ పట్నాయక్ మంగళవారం పరిశీలించారు. సచివాలయాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది విధి నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి అక్కడ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారం, మెనూ కార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శులు నాగమణి, నానిబాబు, పాల్గొన్నారు.

సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

దేశ ప్రజలను మోసగించి దేశ సంపదను మోడీ కార్పొరేట్లకు కట్టపెడుతున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్రం, బెంగుళూరులో ఈ నెల 18వ తేదీ నుండి 21 వరకు జరగబోవు సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని, సిఐటియు పతాకావిష్కరణలు ఎగురువేయాలని కోరుతూ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం మండలంలోని వెంకటరమణ పేట క్వారీల వద్ద, పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద ఆయన జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడి దేశ ప్రజలను మోసగించి, దేశ సంపదను కార్పొరేట్లు కు కట్టబెడుతుంటే కార్మిక వర్గం చూస్తూ ఊరకోబోదన్నారు. మోడీ నుండి దేశ ప్రజలను, దేశ సంపదను కాపాడు కుంటామని, కార్మిక హక్కుల రక్షణకు దేశ వ్యాప్తంగా ఐక్య పోరాటాలు చేపట్టేందుకు సిఐటియు అఖిల భారత మహాసభలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, ఎర్ర ప్రగడ భాస్కరరావు, పోకల భాస్కరరావు, రామచంద్రుడు, శంకర్రావు, కృష్ణ, వెంకటరావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలు రద్దు చేయాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళ వారం స్థానిక విద్యుత జిల్లా స్టోర్స్ వద్ద హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా బిజెపి నాయత్వం లోని మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాసి, యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు కెల్ల గోవింద, పతివాడ రాంబాబు, కలిశెట్టి శ్రీను, మీసాల లెనిన్, పతివాడ చిన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మోడి దేశ ప్రజలను మోసగించి, దేశ సంపదను కార్పొరేట్లుకు కట్ట బెడుతుంటే కార్మిక వర్గం చూస్తూ ఊరకోబోమని మోడి నుండి దేశ ప్రజలను, దేశ సంపదను కాపాడు కుంటామని సిఐటియు నగర కార్యదర్శి బి. రమణ పిలుపు నిచ్చారు. కార్మిక హక్కుల రక్షణకు దేశ వ్యాప్తంగా ఐక్య పోరాటాలు చేపట్టేందుకు సిఐటియు అఖిల భారత మహాసభలు జరుగుతూన్నాయని, కర్ణాటక రాజధాని బెంగుళూర్‌లో ఈ నెల 18 నుండి 21 వరకు జరుగుతున్న ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఎపి బెవరేజెస్ లోకలాశీలతో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలాసీలు అప్పన్న, మేస్త్రి రామకృష్ణా, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మాట్లాడుతున్న సిఐటియు నగర కార్యదర్శి బి. రమణ

బొబ్బిలి: సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు బెంగళూరులో జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం నవ్య జూట్ మిల్లు వద్ద సిఐటియు జండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడుతూ ఆలిండియా మహాసభలో కేంద్ర ప్రభుత్వం చేసిన లేబర్ చట్టాలను, విద్యుత్ సంస్కరణల బిల్లును, ప్రజలపై వేస్తున్న భారాలను, రైతులను దివాలా తీయించే విధానాలను, త్రిప్పి కొట్టేందుకు చర్చ జరుగుతుందన్నారు. ఏప్రిల్ 5 చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మిక వర్గం సిద్ధం కావాలని దానికి ముందుగా మన ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రచారానికి కార్మికులు సంసిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గ్రోత్ సెంటర్ నాయకులు ఎస్ గోపాల్, నవ్య జూట్ మిల్ ప్రెసిడెంట్ బి. చిరంజీవి, కిరణం కార్మికులు పాల్గొన్నారు

విజయనగరం టౌన్ : రవాణా రంగ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈనెల 18 నుంచి 22 వరకు బెంగుళూరులో సిఐటియు 17వ అఖిలభారత మహాసభలు జరగబోతున్నాయని, ఆ మహాసభల్లో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ప్రత్యేక కమిషన్ వేసి చర్చిస్తామని తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రమణ, నాగేషు, కాంట్రాక్ట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ నాయకులు అశోక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ ఒకటిని రద్దు రద్దు చేయాలని ఆ కాపీని దగ్ధం చేశారు

జిఒ 1ని రద్దు చేయాలి

ప్రజాశక్తి- గజపతినగరం

జిఒ నెంబరు ఒకటిని రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి. లక్ష్మి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో జీవో నెంబర్ ఒకటి కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బ్రిటిష్ నాటి జీవోలను తెచ్చి ప్రజాస్వామ్యపు హక్కులను కాలరాస్తున్నదన్నారు. చిన్నచిన్న సాకులతో ర్యాలీలు ప్రదర్శనలు మీటింగులు నిలిపివేయాలని దురుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ప్రజా సంఘాలను ప్రజాపక్షాలను రాజకీయ ప్రతిపక్షాలను నోరు నొక్కి పరిపాలన సాగించాలని చూస్తుందన్నారు. ప్రజాస్వామ్యపు హక్కులకై పోరాటాలు చేసిన చరిత్ర కలిగిన రాష్ట్రంలో హక్కులను హరించి వేయడం జగన్మోహన్ రెడ్డికి తగదని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జి. కృష్ణ, కౌలు రైతు సంఘం నాయకులు రాకోటి రాములు, పి. కృష్ణ, గోవిందు, నారాయణరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: ప్రజా ఉద్యమాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని విదిస్తు తీసుకు వచ్చిన జీవో నెంబరు ఒకటిను వేంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. రాజాంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్రిటిష్ కాలంనాటి 1861 చట్టంతో ప్రజా ఉద్యమాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం విధించడా న్నీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ఉద్యమాలను అణచడానికి , ర్యాలీలు రోడ్డు సోలు, నిషేధిస్తూ ఒకటి జీవోను తీసుకురావడం దుర్మార్గమన్నారు. వైసిపి గడపగడపకు వందలాది మందితో ఎలా ర్యాలీలకు పర్మిషన్ ఇచ్చారని ప్రశ్నించారు. ఈ చట్టం అధికార పార్టీకి వర్తించదా అని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో శంకర్రావు, రాజేష్, రఘు, రవి, దొరబాబు, బుద్ధి, సుగుణమ్మ, మల్లెమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

గజపతినగరం: జీఒ కాపీని దగ్ధం చేస్తున్న నాయకులు

యువత భవిత కోసమే పోరాటం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఉత్తరాంధ్రలోని యువత భవిత కోసమే జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఈ నెల12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో మన యువత - మన భవిత 'యువశక్తి' కార్యక్రమం తలపెట్టారని, ఈ కార్యక్రమంలో వేలాదిమంది యువకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎస్‌కోట నియోజకవర్గ పరిశీలకులు చిలకం మధుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, పారిశ్రామిక వృద్ధి లేక కుటుంబాల వలసలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుపై జనసేన యువశక్తి పేరుతో పోరాటం మొదలు పెట్టిందని, ఇది ఆరంభం మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజాదరణ మెండుగా ఉన్న పవన్ కళ్యాణ్‌ని చూస్తే ప్రభుత్వం జడుసుకుంటోందని ఎద్దేవా చేశారు. యువశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు మరింతగా కష్టపడాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయుకుడు వబ్బిన సత్యనారాయణ

పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాదెండ్ల మనోహార్

నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, పెడిరెడ్ల రాజశేఖర్, ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షుడు కొట్యాడ రామకోటి, కొత్తవలస మండల అధ్యక్షుడు ఎన్.సతీష్, వేపాడ మండల అధ్యక్షుడు సుంకరి అప్పారావు, ఎల్.కోట నుండి ఫిరాజ్, జామి వర్మరాజు, నాయకులు మోపాడ చిన్ని, పి.చంటి, సతీషు, శివాజీ, మల్లువలస శ్రీను, రామదాసు కాళీ, అలమండ రాంబాబు, చిన్ని, పిల్లల రామదుర్గ పాల్గొన్నారు.

భోగాపురం: ఈ నెల 12న రణస్థలంలో జరిగే యువశక్తి సభను విజయవంతం చేయాలని యువశక్తి ప్రచార సమన్వయకర్త పితాని బాలకృష్ణ, నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు లోకం మాధవి పిలుపునిచ్చారు. మండలంలోని ముంజేరు మిరాకిల్ ప్రాంగణంలో మీడియా సమావేశంలో మంగళవారం వారు మాట్లాడారు. రాష్ట్రంలోని యువకులతో పాటు ఉత్తరాంధ్రలో యువశక్తి సభకు అత్యధిక సంఖ్యలో హాజరయ్యే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామని ఆయన అన్నారు. భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల నుంచి 30 వేల మంది యువతీ యువకులను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్ లక్ష్మీ రాజ్, భోగాపురం, పూసపాటిరేగ మండల పార్టీ అధ్యక్షులు వందనాల రమణ, దొర, ముఖ్య నేతలు అంతా పాల్గొన్నారు.

జనసేన లో పలువురు చేరిక

జనసేన రాజకీయ వ్యవహారాల అధ్యక్షులు నాదెండ్ల మనోహర్ సమక్షంలో భోగాపురానికి చెందిన వైసిపి నేత కుమారుడు పల్లంట్ల జగదీష్, మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు కనకమ్మ, ముంజేరు గ్రామానికి చెందిన పిడుగు శంకర్, కొండరాజు పాలానికి చెందిన ముగ్గురు వార్డు సభ్యులు పైడ్రాజు, సూరడ అప్పన్న, రామచంద్ర పేట నుంచి రాము, పలువురు యువకులు మంగళవారం జనసేన పార్టీలో చేరారు.

సర్వే పనులు పరిశీలన

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని లింగాపురం గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న సర్వేను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.సి.హెచ్ సూర్యనారాయణ ఆకస్మికంగా పరిశీలించారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయంలో రీ సర్వే ప్రగతిని సమీక్షించారు. ఈ సమీక్షలో ఇప్పటి వరకు డిఎల్ఆర్ పూర్తి చేసిన 20 గ్రామాల్లో మ్యుటేషన్ లను, పాతవలసిన సర్వేరాళ్ల గురించి ఆరా తీశారు. ఆయనతో పాటు సర్వే అండ్ భూ రికార్డ్స్ ఎడి త్రివిక్రమరావు, తహశీల్దార్, మండల సర్వేయర్ వెంకటరమణ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్

వెలగవలసలో ఆపరేషన్ పరివర్తన

బొబ్బిలి : మండలంలోని చిత్రకోట బొడ్డవలస పంచాయతీ పరిధిలోని వెలగవలసలో నాటుసారా నివారణ గురించి 'ఆపరేషన్ పరివర్తన' అవగాహనా కార్యక్రమాన్ని బొబ్బిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ఆర్. జైభీమ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు నాటుసారా తాగటం వల్ల కలిగే కష్ట, నష్టాలను వివరించారు. నాటుసారాకి బానిస అవటం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. దీని వల్ల కుటుంబ బాంధవ్యాలు చిన్నాభిన్నం అవుతాయని, సమాజంలో గౌరవాన్ని కోల్పోతారని, ఆర్థిక వెనకబాటుకు గురవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలగవలస గ్రామ పెద్దలు బొంగు త్రినాథ, తమ్మిరెడ్డి సత్యం నాయుడు, బొత్స శంకర్రావు, ప్రసాద్, గొట్టపు మురళి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించాలి: కలెక్టర్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రభుత్వం ప్రతిష్టాత్మికంగా చేపట్టిన రీ సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ సూర్యకుమారి కోరారు. మండలంలోని భరణికం గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతులు రీ సర్వేకు సహకరించినప్పుడే వేగంగా సర్వే ప్రక్రియ పూర్తవుతుందన్నారు. రైతులు హాజరై సరిహద్దులను, కొలతలు సరి చూసుకోవాలన్నారు. సర్వే నాణ్యతగా ఉండాలని, ఖచ్చితంగా ఉండాలని అధికారులకు ఆమె సూచించారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల జాబితాకు ఆధార్ సీడింగ్ వేగంగా చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. సచివాలయ సిబ్బందితో పలు పథకాల అమలు, హౌసింగ్, పారిశుధ్య కార్యక్రమాలు తదితర అంశాలపై సమీక్షించారు. స్పందన వినతులు పరిష్కారం క్వాలిటీ గాను, వేగంగా జరగాలన్నారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆమెతో పాటు తహాశీల్దార్ భాస్కర రావు, ఎంపిడిఒ జి. రామారావు, పంచాయతీ అధికారి డి. శ్రీనువాసరావు, ఆర్ఐ సత్తిబాబు, డిటి లావణ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

భూములు లాక్కొంటారా?

శృంగవరపుకోట : జిందాల్ పరిశ్రమ పేరుతో ఆదివాసీల భూములను కారు చౌకగా లాక్కుంటారా అని ఎఐకెఎంకె అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఆశిష్ మిట్టల్ అన్నారు. మంగళవారం మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ కొత్త అడ్డతీగల గ్రామంలో జిందాల్ బాధిత రైతులు ఏర్పాటు చేసిన సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ చూసినా ఆదివాసీలు, గిరిజనులు, రైతులకు అడుగడుగునా తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటం చేయాల్సిందేనని అన్నారు. గతేడాది ఢిల్లీలో జరిగిన రైతు వ్యతిరేక చట్టాల ఉద్యమం ప్రతి ఉద్యమకారుడికి స్ఫూర్తి అని అన్నారు. జిందాల్ పరిశ్రమ కోసం భూములు తీసుకొని సుమారు 15 ఏళ్లు కావస్తున్నా ఎటువంటి పరిశ్రమ నిర్మించలేదని, చట్ట ప్రకారం ఐదేళ్లు ఎటువంటి పరిశ్రమ నిర్మించకపోతే తిరిగి ఆ భూమిని రైతులకు అప్పగించాలని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు భూములను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంకె ప్రధాన కార్యదర్శి తాండ్ర ప్రకాష్, పిఒడబ్ల్యు ప్రతినిధి ఎం లక్ష్మి, ఐఎఫ్‌టిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కన్వీనర్ సుర్ల వెంకటరమణ, అరుణోదయ సంస్థ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు ఊలం పార్వతి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఊలం మల్లేష్, రాష్ట్ర నాయకులు వెంకటలక్ష్మి, కాకి దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పి.శంకర్రావు మాట్లాడుతూ అంగన్‌వాడి వర్కర్స్‌కు నిత్యవసరాల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను సచివాలయ పర్యవేక్షణలో చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటికే కేంద్రాలను ఐసిడిఎస్ పీడీ, సిడిపిఒ, సూపర్ వైజర్లు, పర్యవేక్షణ చేస్తున్నారని మళ్లి కొత్తగా సచివాలయ పర్యక్షణ అంటు అంగన్ వాడీలను వేధించడం సరి కాదని అన్నారు. అంగన్‌వాడీల కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలనే తదితర డిమాండ్లతో కూడిన వినతిని తహసీల్దార్ యన్.రాజారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు

సోంపురంలో గడపగడపకు..

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డితో పాటు తనను ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడప ఈశ్వరరావు, నెట్ కేఫ్ డైరెక్టర్ సిహెచ్ పద్మావతి, ఎంపిడిఒ బివిఎస్‌కెవిఎన్ పట్నాయక్, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు ఎం జగన్నాథం, జిల్లా బీసీ సెల్ వైయస్సార్ పార్టీ అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ ఎం. గంగరాజు, ఎంపిటిసి సత్యనారాయణ, టివి రమణ, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఈర్లే సన్యాసినాయుడు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు బీల సతీష్, బుద్ధ అప్పలనాయుడు, బోజంకి శ్రీను, గంగు నాయుడు, రుద్ర వెంకటరావు, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వైసిపి పాలనలో రాష్ట్రం అప్పుల పాలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

వైసిపి పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని పుణ్యగిరిలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సంక్షేమం పేరు చెప్పి ప్రభుత్వం ప్రజలను దోచుకొని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని అన్నారు. పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలు, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ మోతలతో సామాన్య, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, టిడిపి సీనియర్ నాయకులు మల్లీశ్వరరావు, పొట్నూరు అప్పలరాజు, సరిపల్లి రామకృష్ణ, ఐటిడిపి రాష్ట్ర సెక్రటరీ సిహెచ్. కిరణ్, చిన్ని కృష్ణ, పుణ్యగిరి మాజీ ఎంపిటిసి గొర్ల కన్నతల్లి, అక్కునాయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని మధుపాడు గ్రామంలో మంగళవారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మణ నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండకడుతూ, ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, పార్టీ రైతు కార్యదర్శి లెంక బంగారు నాయుడు, క్లస్టర్ ఇంఛార్జిలు ప్రదీప్ కుమార్, గుంట్రోతు గోవిందు, పార్టీ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జామి: ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

జామి: మండలంలోని జెడివలస గ్రామంలో టిడిపి మంగళవారం రాత్రి ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు గొంప కృష్ణ మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికే చాలా మంది టిడిపిలో చేరుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు లగుడు రవికుమార్, మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు, రెడ్డి పైడిబాబు, వెంట్రాపు నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

భావ వ్యక్తీకరణకు ఆంగ్ల భాష కీలకం

నెల్లిమర్ల : ప్రతి విద్యార్థి ఆంగ్లంలో భావ వ్యక్తీకరణ చేయగల స్థాయిలో ఉండాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. మంగళవారం సెంచూరియన్ కెపాబిలిటీ అండ్ కాంపిటెన్సీ డెవలప్మెంట్ సెంటర్ (సిసిసిడిసి) ఆధ్వర్యంలో ఆంగ్ల భాష శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రెండు వారాలపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమం అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ రెండు వారాల్లో ఆంగ్ల భాష ఉచ్చారణలో లోపాలను సరిదిద్దుకోవాలన్నారు. ఈ సందర్భంగా కొవ్విడి మాట్లాడుతూ నిత్యం సాధన చేయడం ద్వారా మంచి వక్తగా మారవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, ప్రొఫెసర్ కృష్ణమూర్తి, పారా మెడికల్ డీన్ ప్రొఫెసర్ లక్ష్మీనరసింహాచార్యులు, సిసిసిడిసి సభ్యులు బెనర్జీ, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీసీ జిఎస్ఎన్‌రాజు

ఎక్స్‌గ్రేషియా అందజేత

బొబ్బిలి : మండలంలోని పక్కి గ్రామానికి చెందిన శంబంగి సీతంనాయుడు ఇటీవల విద్యుత్ షాక్ తో మరణించిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబ సభ్యులకు విద్యుశాఖ కేటాయించిన ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు మంగళవారం అందించారు.

అగ్నికుల క్షత్రియ జిల్లా అధ్యక్షులుగా నర్సింగరావు

పూసపాటిరేగ : అగ్నికుల క్షత్రియ జిల్లా అధ్యక్షులుగా మండలంలోని కుమిలికి చెందిన దున్న నరింగరావు ఎంపిక చేసినట్లు ఆ సంఘ ఎపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. విజయవాడలో సన్‌స్కేర్ పంక్షన్ హాలులో అగ్నికుల క్షత్రియ యూత్ పోర్స్ కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ జాతీయ కార్యదర్శి నాగిడి సాంబశివరావు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేసారు. జిల్లా ఉపాధ్యాక్షులుగా పనతాడ మన్మధరావు, ప్రధాన కార్యదర్శిగా కరణం అప్పలరాజు నియమించారు.